క్లుప్తంగా

ఎస్‌జీఎఫ్ బాక్సింగ్, స్కేటింగ్ క్రీడా పోటీలు

గుంటూరువెస్ట్ (క్రీడలు): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాల బాలికల క్రీడా పోటీలు నిర్వహిస్తామని జిల్లా నిర్వహణ కార్యదర్శి జి.ప్రతాప్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24న అమరావతిలోని చరితారెడ్డి డిఫెన్స్ అకాడమీలో బాస్కింగ్, గుంటూరులోని బీఆర్ స్టేడియంలో స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 25న కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ సైక్లింగ్ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. అండర్-14లో పాల్గొనే చిన్నారులు జనవరి 1, 2009 తర్వాత, అండర్-17 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2006 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. సంబంధిత పాఠశాలల నుంచి ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలన్నారు.

డిజిటల్ టెలివిజన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న బీఎస్‌ఎన్‌ఎల్ జీఎం ఎస్ శ్రీధర్

నెహ్రూనగర్: బీఎస్‌ఎన్‌ఎల్ ఆంధ్రప్రదేశ్ టెలికం సర్కిల్, ఉల్కా టీవీ కలిసి సంయుక్తంగా అందించే డిజిటల్ టెలివిజన్ ప్రసార సేవలను గుంటూరు, ప్రకాశం జిల్లాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఎస్‌ఎన్‌ఎల్ బిజినెస్ ఏరియా(గుంటూరు, ప్రకాశం జిల్లాల) జీఎం సప్పరాజు శ్రీధర్ కోరారు. గుంటూరు చంద్రమౌళినగర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరో వారం రోజుల్లో ఉల్కా సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని, గుంటూరు బిజినెస్ ఏరియాలో మొత్తం 26వేల బీఎస్‌ఎన్‌ఎల్ బ్రాడ్ బాండ్ కనెక్షన్లు ఉన్నాయని, వారితోపాటుగా కొత్తగా చేరే వినియోగదారులకు ఈ డిజిటల్ ప్రసారాలను అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆండ్రాయిడ్ టీవీ ఉన్నవారికి ఎలాంటి సెటప్ బాక్స్, యాంటీనాలు లేకుండా వైఫై లాన్ ద్వారా టీవీ సేవలను పొందవచ్చన్నారు. ఉల్కా టీవీలో మొత్తం ఐదు ప్యాకేజీలతో పాటు బండిల్ ప్లాన్ అందుబాటులో ఉందన్నారు. రూరల్, అర్బన్ ప్రాంతాలకు విడివిడిగా ప్లాన్స్ ఉన్నాయన్నారు. డీజీఎంలు పి కోటేశ్వరరావు, రఘురామ్, అధికారులు నాగేశయ్య, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు

బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. శనివారం బాపట్ల జిల్లా వ్యాప్తంగా నో యాక్సిడెంట్ డేను నిర్వహించారు.

ముఖారవిందంగా...

బాలిక ముఖాన్ని అందంగా తీర్చిదిద్దారు
- గుంటూరు జీజీహెచ్‌లో కాస్మోటిక్ సర్జరీ
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ పూర్తి ఉచితం



ఆపరేషన్ చేస్తున్న ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు

గుంటూరు మెడికల్: ముఖంలో ఒకవైపు ఎత్తుగా, మరోవైపు ఎత్తు తక్కువగా ఉండి చూసేందుకు అందవికారంగా ఉన్న 12 ఏళ్ల బాలికకు గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు మొట్టమొదటిసారిగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేసే ప్లాస్టిక్ సర్జరీ చేసి బాలిక ముఖాన్ని అందంగా తీర్చిదిద్దారు. శనివారం సుమారు మూడుగంటల సేపు కాస్మోటిక్ సర్జరీ చేసి బాలికకు నూతన జీవితాన్ని ప్రసాదించామని ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్ మీడియాకు తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన పదేళ్ల బాలిక పుట్టుకతో వచ్చే జన్యుపరమైన లోపాల వల్ల ముఖంలో లోపాలతో జన్మించింది. తద్వారా బాలిక మొఖంలో ఒకవైపు గుంటపడినట్లు లోతుగా శరీర భాగం ఉండి మరోవైపు ఎత్తుగా ఉండి చూసేందుకు చాలా భయానకంగా తయారైంది. తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల్లో చూపించినా వైద్యులు నయం చేయలేకపోయారు.

ముఖం అంధవికారంగా తయారవడంతో బాలిక చదువుకు సైతం స్వస్తి పలికి ఇంట్లోనే ఉండి పోయింది. కనీసం బయట స్నేహితులు, కుటుంబ సభ్యులతో గడిపేందుకు బయటకు రాలేక మానసిక ఒత్తిడికి గురై ఇంట్లోనే ఉండిపోయింది. గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు అత్యాధునిక వైద్య పరికరాలతో కాస్మోటిక్ సర్జరీలు చేస్తారనే విషయాన్ని తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు జనవరి రెండో వారంలో ప్లాస్టిక్ సర్జరీ వైద్యులను సంప్రదించారు. బాలికకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి 'ప్రొగ్రెసీవ్ హెమీ ఫేషియల్ ఎట్రోఫీ' అనే సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించామని డాక్టర్ సుమితా శంకర్ చెప్పారు. ముఖం ఒకవైపు చిన్నదిగా అయిపోవడం, దీనివల్లే జరిగిందన్నారు. శనివారం ఆటోలోగస్ ఫ్యాట్ గ్రాఫ్టింగ్ సర్జరీ చేసి బాలిక మొఖాన్ని సరిచేసి అందంగా తీర్చిదిద్దామన్నారు. పొట్ట, తొడల వద్ద ఉన్న కొవ్వు తీసి సెల్ థెరఫీ ద్వారా మొఖంలో ఉన్న లోతు భాగం మొత్తాన్ని భర్తీ చేశామన్నారు. సుమారు రూ. 2 లక్షల ఖరీదు చేసే కాస్మోటిక్ సర్జరీని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా చేశామన్నారు.

బాలికకు శస్త్రచికిత్స చేయని పక్షంలో మొఖం వికారంగా మారి పూర్తి ఒత్తిడికి గురవడంతోపాటు, పెద్ద వయస్సులోకి వచ్చే సరికి వివాహ సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ముంబాయి, ఢిల్లీ లాంటి పెద్ద నగరాల్లో చేస్తున్న కాస్మోటిక్ సర్జరీలను గుంటూరు జీజీహెచ్‌లో తాము ఉచితంగా చేస్తున్నామన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గంగాభవానీ, డాక్టర్ నజ్మ, డాక్టర్ చంద్రలేఖ, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ సాధనాల నిశాంత్, పీజీ వైద్యులు నిఖిల, విజయ, హారిక పాల్గొన్నట్లు వెల్లడించారు. అరుదైన సమస్యతో బాధపడుతున్న బాలికకు కాస్మోటిక్ సర్జరీ చేసి ముఖాన్నిఅందంగా తీర్చిదిద్దిన ప్లాస్టిక్ సర్జరీ వైద్యులను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి అభినందించారు.

ఎంపీ నిధులతో స్టీలు బెంచీలు

- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రైల్వేస్టేషన్‌లకు ఒనగూరిన సౌకర్యాలు
- గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రారంభించిన ఎంపీ జీవీఎల్



బెంచీలను ప్రారంభిస్తున్న ఎంపీ జీవీఎల్

లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ): కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు అన్ని విధాలా సదుపాయాలు కల్పిస్తున్నట్లు బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఎంపీ నిధులు రూ.50 లక్షల వ్యయంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 12 రైల్వేస్టేషన్‌లలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్లాట్‌ఫారంలపై ఏర్పాటుచేసిన స్టీల్ బెంచీలను శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రతిపక్షాలు కూడా అంగీకరించక తప్పదన్నారు. దీనికి నిదర్శనమే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు, ప్లాట్‌ఫారాల ఆధునీకరణ స్మార్ట్ స్టేషన్‌ల నిర్మాణం అన్నారు. వచ్చే ఏడాదిలోగా గుంటూరు రైల్వేస్టేషన్‌ను రూ.20 కోట్లతోనూ గుంటూరు డివిజన్‌లోని 30స్టేషన్‌లను రూ.10 కోట్లతోనూ ఆధునికీకరించనున్నట్లు తెలిపారు. డీఆర్‌ఎం ఆంజనేయులు, ఏడీఆర్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి తక్కెళ్లపాడులో నాటిక పోటీలు

ప్రతి రోజూ మూడు నాటికలు

పెదకాకాని (పొన్నూరు): డాక్టర్ కాసరనేని సదాశివరావు నాటక కళాపరిషత్ 12వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు లలిత కళానికేతన్ వ్యవస్థాపకుడు మోపర్తి కాళిదాసు తెలిపారు. గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, తక్కెళ్ళపాడు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మోపర్తి కాళిదాసు మాట్లాడుతూ డాక్టర్ కాసరనేని శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేశామని, ప్రతి రోజూ మూడు నాటికలు ప్రదర్శింపబడతాయన్నారు. నిత్యం సమాజంలో జరుగుతున్న సంఘటనలను కళ్ళకు కట్టినట్లు చూపించడంతో పాటు నేటి సమాజానికి మంచిని పంచాలనే ఆశయంతో ఈ నాటికల ప్రదర్శనలు జరుగుతాయన్నారు. కళలను ఆదరించి కళాకారులను పోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

లలిత కళానికేతన్ ఆధ్వర్యంలో ఈనెల 22న సాయంత్రం 7:15 గంటలకు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అనంతరం 7:30 గంటలకు తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చైతన్య కళాభారతి వారి చైతన్యపువ్వు నాటిక ప్రదర్శింప బడుతుందన్నారు. 8:30 గంటలకు సభా కార్యక్రమం అనంతరం 9 గంటలకు మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్ వారి అందిన ఆకాశం, కళాలయ కొలకలూరి వారి అగ్నిగర్భ నాటికలు ప్రదర్శింపబడతాయన్నారు. రెండవరోజు 7:30 గంటలకు గంగోత్రి పెదకాకాని వారి పేగురాసిన శాసనం, 9 గంటలకు శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి గమ్యస్థానాల వైపు, 10:30 గంటలకు ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి యాది నాటికలు ప్రదర్శింపబడతాయన్నారు. చివరి రోజు మంగళవారం రాత్రి 7:30 గంటలకు అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి వెండి అంచులు, రాత్రి 9 గంటలకు రసఝురి పొన్నూరు వారి గుర్తు తెలియని శవం, చివరి ప్రదర్శనగా 10:30 గంటలకు వేముల ఆర్ట్స్ థియేటర్స్ గుంటూరు వారి సూత్రం నాటికలు ప్రదర్శింపబడతాయన్నారు. ప్రతి నాటికకు ప్రదర్శన పారితోషకం 15000 రూపాయలతో పాటు ఉత్తమ ప్రదర్శనకు 5,000 రూపాయలు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు 3,000 రూపాయలు, తృతీయ ఉత్తమ ప్రదర్శనకు 2,000 రూపాయలు, జూరీ ప్రదర్శన 1కు 1000 రూపాయలు, జూరీ ప్రదర్శన 2 కి 1000 రూపాయల చొప్పున నగదు బహుమతులు అందజేయడం జరుగుతుదని వివరించారు.

సంక్షేమపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి

మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున, పక్కన ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

నిజాంపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ రాజ్యాన్ని స్థాపించి పారదర్శక పాలన సాగిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని పల్లపట్లలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావుతో కలసి శనివారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు ఆయన వద్దే ఉంచుకున్న శాఖలో ఖర్చు చేసిన నిధులకు కనీసం లెక్కలు లేని విధంగా అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ పాలనలో జరిగిన లబ్ధి ఏ ప్రభుత్వంలో జరగలేనిపేర్కొన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులకు పెంపుదల చేసేందుకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల ప్రాణాలు పోతున్నా టీడీపీ నాయకులకు పట్టడం లేదని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు విమర్శించారు. బహిరంగ సభలు పెట్టుకునే సమయంలో ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆయా రాజకీయ పార్టీలు గుర్తుంచుకోవాలన్నారు. జీఓ నంబర్ 1 పై రాజకీయం చేయటం చంద్రబాబుకు తగదని హితవు పలికారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



ఏటుకూరులోని లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జేసీ జి రాజకుమారి

గుంటూరురూరల్: జగనన్న కాలనీలలో చేపట్టిన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు కృషిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి రాజకుమారి అధికారులను ఆదేశించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఏటుకూరు లేఅవుట్‌ను ఆమె శనివారం సందర్శించారు. అనంతరం జేసీ ఉగాది నాటికి పూర్తి చేయాల్సిన 1653 గృహాల నిర్మాణాలను గురించి అధికారులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ గృహాల నిర్మాణాలకు సంబంధించి రోజువారి ప్రణాళికలు సిద్ధం చేయాలని వార్డు ఎమినిటీ సెక్రటరీలను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం, పురోగతిని లేఅవుట్లలో కడుతున్న గృహాల వివరాలు ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణాలు ఏవిధంగా జరుగుతున్నాయి, వాటి నాణ్యతలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాల్లో ఎటువంటి సమస్యలున్నా వెంటనే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఆర్థిక సాయం, ఉచితంగా ఇసుక, రాయితీపై సిమెంట్, ఇనుమును అందించటంతోపాటు డ్వాక్రా సంఘం సభ్యులకు పావలా వడ్డీకే రూ.35 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి రోజూ స్పష్టమైన పురోగతి కనిపించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుకోకుండా వచ్చిన ఒక్క అవకాశం ఆ రైతును ఎడ్లపందేల వ్యాఖ్యాతగా మార్చింది. తనకొచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, క్షణాల వ్యవధిలో స్థానాలు మారిపోయే ఎడ్ల పోటీల్లో తనదైన శైలిలో ఉరకలెత్తేలా.. హుషారైన వ్యాఖ్యానాన్ని జోడించి ప్రేక్షకులను అలరించారు. ఇంకేం ఎక్కడ ఎడ్లపందేలు జరిగినా ప్రేక్షకులు ఈయన వ్యాఖ్యానాన్నే కోరుకునేలా ఖ్యాతి గడించారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటకలో సైతం జరిగిన సుమారు 300 పైగా పోటీల్లో వ్యాఖ్యానంతోపాటు రిఫరీగా అలరిస్తున్నారు కృష్ణాజిల్లా పెనుమత్సకు చెందిన సూరపనేని రాధాకృష్ణప్రసాద్.

మైక్ పడితే ఉర్రూత..
విజిలేస్తే దాటరు గీత

- వృత్తి వ్యవసాయం, ప్రవృత్తి వ్యాఖ్యానం
- వీక్షకులకు ఆయన వ్యాఖ్యానం ప్రత్యేక ఉత్తేజం
- ఎడ్ల పందేల వ్యాఖ్యాత కం రిఫరీగా చేస్తున్న 'సూరపనేని'
- మూడు రాష్ట్రాల్లో ఎడ్ల ప్రదర్శనలకు పనిచేసిన వైనం


ప్రదర్శనను పర్యవేక్షిస్తూ, వ్యాఖ్యానంతో ఉత్తేజపరుస్తున్న సూరపనేని (ఫైల్)

తెనాలిరూరల్: తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలో ఎడ్ల బల ప్రదర్శన/ ఎడ్ల పందేలు జరిగితే కంచు కంఠం లాంటి స్వరం వ్యాఖ్యానం చేస్తుంటుంది. ఎడ్ల జతలు బండను ఎంత దూరం లాగాయి? ఇంకా ఎంత సమయంలోపు ఎంత దూరం లాగితే ఏ స్థానంలో ఉంటాయంటూ వివరాలతో కూడిన వ్యాఖ్యానం ప్రేక్షకులను అలరిస్తుంటుంది. ఆయన సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. ఇంటర్మీడియెట్ వరకు చదువుకుని, వారసత్వంగా వచ్చిన పొలాన్ని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ ఉండే వారు. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో జరిగే ఎడ్ల ప్రదర్శనల్లో హెచ్చు శాతం ఆయన వ్యాఖ్యానమే వినిపిస్తుంటుంది.


అనుకోకుండా వచ్చిన అవకాశం..

కృష్ణా జిల్లా పెనుమత్సకు చెందిన సూరపనేని రాధాకృష్ణప్రసాద్.. ఉన్న ఒక్క కుమారుడిని ఉన్నత చదువుల చదివించాలన్న తపనతో వ్యవసాయాన్నే నమ్ముకున్నారు. తనకున్న ఐదెకరాల్లో సాగు చేసుకుంటుండే వారు. వ్యవసాయం, దాని ఆధారమైన పాడి అంటే ఎనలేని మక్కువ ఉన్న ఆయనకు చిన్నతనం నుంచే ఎడ్ల ప్రదర్శనలపై ఆసక్తి ఉండేది. ప్రదర్శనలు ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి వస్తుండేవారు. అంతే కాక, తనకు తెలిసిన వారి ఎడ్లకు తాడు తీయడం, సైడు తోలడం చేసే వారు. అలా ప్రదర్శనలకు వెళుతున్న క్రమంలో 2009లో రేపల్లె సమీపంలో పెనుమూడి వారధి వద్ద జరిగిన ప్రదర్శనల్లో ఆయనకు వ్యాఖ్యానం చేసే అవకాశం లభించింది. అక్కడ ఆయన చేసిన వ్యాఖ్యానం నిర్వాహకులతో పాటు, వీక్షకులకూ నచ్చింది. దీంతో అవకాశాలు రావడం ప్రారంభమయ్యాయి. ఇక రిఫరీ కం వ్యాఖ్యానం ప్రవృత్తిగా మారింది. ఎన్నో రౌండును ఎడ్లు ఎంత సమయంలో పూర్తి చేశాయి, అంతకు ముందే ప్రదర్శనలో వచ్చిన ఎడ్లకు, ప్రస్తుతం జరుగుతున్న వాటికి మధ్య ఎంత సమయ వ్యత్యాసం ఉందో వివరిస్తూ ఆయన చేసే వ్యాఖ్యానం వీక్షకులను ఇట్టే ఆకట్టుకుంటుంది. ప్రదర్శనలో ఉన్న ఎడ్లు ఎన్నో స్థానంలో ఉన్నాయి, మిగిలి ఉన్న సమయంలో ఎంత దూరం లాగితే ఎన్నో స్థానంలో ఉంటాయో సెకన్లలో లెక్క వేసి చెప్పడం ఈయనలోని విశేషం.

మూడు రాష్ట్రాల్లో వ్యా'ఖ్యాతి'

దాదాపు తెలుగు రాష్ట్రాల్లో జరిగే ప్రదర్శనలకు ఈయనను వ్యాఖ్యాతగా పిలుస్తుంటారు. ఈ రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాయచూర్‌లో జరిగే పోటీలకూ ఈయనే వ్యాఖ్యాత కం రిఫరీగా వ్యవహరిస్తుంటారు. ఇప్పటి వరకు 300 ప్రదర్శనలకు పైగా ఈయన వ్యాఖ్యానంలో జరిగాయి. ప్రదర్శనల్లో గట్టి పోటీ ఇచ్చే ఎడ్ల జతలు నిర్ణీత సమయంలో మధ్య మధ్యలో కొన్నిసార్లు బండను స్పీడుగా లాగుతుంటాయి. ఆ సమయంలో వీటికి వీక్షకుల ఈలలు, కేరింతలు తోడవుతాయి. అదే సమయంలో 'రెండో స్థానంలో కొనసాగుతున్న జతలకన్నా ఇన్ని సెకన్లు ముందంజలో ఉన్నాయి అని చెప్పి, ఒక సెకను గ్యాప్ ఇచ్చి, మొదటి స్థానంలో కొనసాగుతున్న జత కన్నా ఇన్ని సెకన్లు వెనుకంజలో ఉన్నాయంటూ రాధాకృష్ణ చేసే వ్యాఖ్యానం ప్రేక్షకులలో మరింత జోష్‌ను నింపుతుంది. కొంత మంది రిఫరీ/వ్యాఖ్యాతలు కేవలం ఎడ్ల బలప్రదర్శనకే పరిమిత మవుతారు. స్పార్కీ, ఇసుక, కూటీలాగుడు, ఎడ్లపోటీలు, టైరుబండి పోటీలు ఇలా పాడికి సంబంధించిన అన్ని రకాల పోటీలకు వ్యాఖ్యానం చేయడం రాధాకృష్ణ స్పెషాలిటీ. రెండు తెలుగు రాష్ట్రల్లోని పశు పోషకులూ ఈయనకు సుపరిచయులే. పోటీలకు సంబంధించి ఈయనకు వచ్చిన సమాచారాన్ని వారికి తెలియజేస్తూ, పోటీలకు ఆహ్వానిస్తూ ఉంటారు. పోటీలకు వచ్చే ఎడ్ల జత యజమానులతో పాటు, వాటిని సాకే/ తోలే సిబ్బంది బాగోగులు సైతం రాధాకృష్ణ ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటారు.

వ్యాఖ్యానం ప్రవృత్తిగా మారింది..



పెనుమూడి వద్ద జరిగిన పోటీల్లో అనుకోకుండ వ్యాఖ్యానం చేసే అవకాశం వచ్చింది. అది అక్కడివారికి నచ్చడంతో అవకాశాలు వచ్చాయి. తెనాలిలోనే 12 ఏళ్లుగా ఎడ్ల బలప్రదర్శనల పోటీలకు వ్యాఖ్యానం చేస్తున్నాను. వ్యవసాయం నాకు వృత్తి, అయితే ప్రదర్శనలకు వ్యాఖ్యానం చేయడం ప్రవృత్తిగా మారింది.

సూరపనేని రాధాకృష్ణప్రసాద్

అవగాహన ఉంటే
కాదంత పెద్ద సమస్య



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి బాపట్ల జిల్లాకు చెందిన పాలపర్తి కోటేశ్వరరావు. ఇతడికి ఇటీవల జరిగిన కొట్లాటలో దవడ ఎముక విరిగిపోయింది. బాధితుడిని కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. జీజీహెచ్ దంత వైద్య విభాగంలో సుమారు లక్షరూపాయల ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఉచితంగా చేసి విరిగిన దవడ ఎముకను సరిచేశారు. సోమవారం ఆపరేషన్ పిదప ఫాలో అప్‌చికిత్స కోసం వచ్చిన బాధితుడిని పరీక్షించి మందులు కూడా ఉచితంగా అందించారు.

గుంటూరు మెడికల్: ఇలా ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాల్లో, దాడుల్లో గాయపడి దంతాలు విరిగిపోయి, దవడ ఎముకలు విరిగిపోయి చికిత్స కోసం వచ్చే బాధితులకు దంత వైద్యులు తక్షణమే ఆపరేషన్లు చేసి గుంటూరు జీజీహెచ్ దందవైద్యులు ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడుతున్నారు.


దంత వైద్య విభాగం

దంతాలు చాలా ముఖ్యం....

మనిషి జీవించాలంటే గాలి, నీరు తరువాత ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలి. ఆహారాన్ని నోటి ద్వారా దంతాలతో నమిలి తీసుకుంటాం. దంతాలు ఆహారం తీసుకునేందుకు సహకరించక పోతే ఆ బాధ గురించి వర్ణించటం కష్టంగా ఉంటుంది. ఆధునిక జీవన శైలికి అలవాటు పడిన ప్రజానీకం పలు దంత సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆహారపు అలవాట్లు సక్రమంగా లేకపోవడం, కొద్దిపాటి సమస్య ఉన్నప్పుడు పట్టించుకోకపోవడంతో దంత సమస్యలు పెద్దవిగా మారుతున్నాయి. నోటిని చూసి మనిషి ఆరోగ్యం చెప్పొచ్చని దంత వైద్యులు అంటున్నారు.

- దంత సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దంటున్న వైద్యులు
- జీజీహెచ్‌లో డెంటల్ సమస్యలకు కార్పొరేట్ వైద్యం
- లక్షలాది రూపాయల ఆపరేషన్లు ఉచితంగానే..

ప్రతిరోజూ 50 మందికి వైద్య సేవలు..

గుంటూరు జీజీహెచ్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన రోగులతోపాటు ఇతర జిల్లాకు చెందిన దంత సమస్య బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. ప్రతిరోజూ 50 మంది దంత వైద్య విభాగం ఓపీ విభాగంలో చికిత్స పొందుతున్నారు. పుచ్చిపోయిన పంటిని శుభ్రం చేసి అందులో సిమెంట్, సిల్వర్ మెటల్‌ను పెట్టి నొప్పిని తగ్గించే విధానం జీజీహెచ్‌లో అందుబాటులో ఉంది. పాచిపట్టిన, గారపట్టిన పళ్లను స్కేలింగ్ ద్వారా శుభ్రం చేస్తున్నారు. దంత వైద్య విభాగాధిపతి డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దంత వైద్య విభాగంలో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే ధీటుగా డెంటల్ సర్జరీలు ఉచితంగా చేస్తున్నారు.

వారంలో నాలుగు ఆపరేషన్లు....

రోడ్డు ప్రమాదాల్లో, దాడుల్లో గాయపడి దవడ ఎముకలు విరిగిన వారికి, నోటిలో చీము గడ్డలు ఉన్నవారికి, నోట్లో కణితులు ఉన్నవారికి, పెదాలు చీలిన వారికి, పళ్లు విరిగిపోయిన వారికి దంత వైద్య విభాగంలో తక్షణ వైద్యసేవలను అందిస్తున్నారు. వారంలో నాలుగు మేజర్ డెంటల్ సర్జరీలు సుమారు లక్షఖరీదు చేసే ఆపరేషన్లు పూర్తి ఉచితంగా చేస్తున్నారు. కోవిడ్ విపత్తులో ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన బ్లాక్ ఫంగస్ బాధితులకు దంత వైద్యులు తమ ప్రాణాలు అడ్డుపెట్టి ఉచితంగా సర్జరీలు చేసి పలువురి ప్రాణాలు కాపాడారు.

దంత సమస్యలపై అవగాహన ఉండాలి...



ప్రతి ఒక్కరు దంత సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి. ప్రాథమిక దశలోనే దంత వైద్యులను సంప్రదించటం ద్వారా పన్ను పూర్తిగా పాడవ్వకుండా కాపాడవచ్చు. ప్రతి రోజూ రెండు పూటలా దంతాలు శుభ్రం చేసుకోవాలి. రెండు నిమిషాల పాటు బ్రష్ చేయాలి. ఏదైనా ఆహారం తిన్న వెంటనే నోటిలో నీరు పోసుకుని పుక్కిలించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా టూత్ బ్రష్‌ను మార్చాలి. దంత వైద్యులను సంప్రదించాలి. దంతాల సమస్యలకు నాటు వైద్యం చేసుకుని ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. జీజీహెచ్‌లో ఉచితంగా డెంటల్ ఆపరేషన్లు చేస్తున్నాం.

– డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, దంత వైద్య విభాగాధిపతి, జీజీహెచ్

తపాలా బ్యాంక్

అతి తక్కువ ప్రారంభ నగదుతో ఖాతా తెరుచుకునే సౌలభ్యం.. పదేళ్లు నిండిన చిన్నారులు సైతం తేలిగ్గా లావాదేవీలు నిర్వహించగలిగేలా సులువైన రీతుల్లో నిర్వహణ.. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లోని వారు సైతం తాముున్న చోటే బ్యాంకు సేవలు, ఇతరత్రా సేవలు పొందగలిగే సౌకర్యం.. అదే ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్. ప్రజలందరికీ ఆర్థిక సేవలు చేరువ చేయాలనే ఉద్దేశంతో తపాల శాఖ సరికొత్త విధానంలో ప్రవేశపెట్టిన ఈ బ్యాంక్ అందరి ఆదరణను చూరగొంటోంది..


అరండల్‌పేట పోస్ట్ ఆఫీస్

- ఐపీపీబీతో పోస్టాఫీసుల్లో బ్యాంకింగ్ లావాదేవీలు
- రూ.100తో సేవింగ్స్ ఖాతా, జీరో బ్యాలెన్స్‌తో కొనసాగింపు
- రూ.వెయ్యితో కరెంట్ ఖాతా, ఇతరత్రా సేవలు

లక్ష్మీపురం: భారత ప్రభుత్వం తపాలాశాఖ ద్వారా ప్రజందరికీ ఆర్థిక సేవలను అందుబాటులో ఉంచాలనే ధ్యేయంతో నూతనంగా ప్రారంభించిన ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)ద్వారా వివిధ రకాల బ్యాంకింగ్ సేవలను పోస్టాఫీసు ఉన్న ప్రతి గ్రామంలో అందుబాటులోకి తెచ్చింది. ఈ ఐపీపీబీ ద్వారా రైతులు ప్రత్యక్ష నగదుబదిలీ ప్రయోజనదారులు, వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులు, గృహిణులు, దుకాణాదారులు, చిరు వ్యాపారులు వివిధ బ్యాంకింగ్ లావాదేవీలు జరుపుకోవచ్చు. దేశ వ్యాప్తంగా ఉన్న ఏ పోస్టాఫీసులోనైనా ఖాతాను తెరిచి బ్యాంకింగ్ లావాదేవీలు జరుపుకోవచ్చు. 10సంవత్సరాలు పై బడిన ఏ వ్యక్తి అయినా కేవలం ఆధార్ కార్డు, మొబైల్‌ఫోన్, వేలిముద్రతో ఎటువంటి పత్రాలు, ఫొటోలు లేకుండా క్షణాల్లో ఐపీపీబీ సేవింగ్స్ ఖాతాను రూ.100తో తెరిచి, ఆతరువాత సున్నా బ్యాలెన్స్‌తోనే వివిధ సదుపాయాలను ఉపయోగించుకోవచ్చు. మరింత సమాచారం, ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 155299

సేవింగ్స్ ఖాతా సదుపాయాలు...

- ఆధార్ సీడింగ్‌తో వివిధ సబ్సిడీలు, నగదు బదిలీ (ఉపాధి హామీ, గ్యాస్, రైతు, భరోసా, పీఎం కిసాన్, స్కాలర్‌షిప్, అమ్మ ఒడి, మాతృవందనం, లా నేస్తం, చేనేత భరోసా, వాహన మిత్ర వంటి సంక్షేమ పథకాలతో అనుసంధానం)
- వేలి ముద్ర, ఓటీపీ ద్వారా నగదు డిపాజిట్, విత్‌డ్రా సౌకర్యం, అధునాతన సీటీఎస్ స్కానింగ్ ద్వారా 24 గంటల్లో చెక్ డిపాజిట్ సౌకర్యం.
- ఆధార్ – ఏటీఎం (ఏఈపీఎస్) (ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం) సౌకర్యంతో మీ ఏ ఇతర బ్యాంకు ఖాతాల నుంచి అయిన నగదు విత్ డ్రా చేసుకునే సదుపాయం, నగదు బదిలి చేసుకునే సదుపాయం.
- మొబైల్ బ్యాంకింగ్ యాప్ ద్వారా నెఫ్ట్, ఐఎంపీఎస్, ఆర్‌టీజీఎస్ ద్వారా ఇతర బ్యాంకులకు నగదు బదిలీ చేసుకోవచ్చు.
- కరెంట్ బిల్లులు, మొబైల్ రీచార్జ్‌లు, డీటీహెచ్ రీచార్జ్‌లు, ఇతర చెల్లింపులు ఈ యాప్ ద్వారా చేసుకోవచ్చు.
- మొబైల్ బ్యాంకింగ్ యాప్ ద్వారా పోస్టాఫీసు ఆర్‌డీ ఆర్‌డీ లోన్, పీపీఎఫ్, సుకన్య ఖాతాలకు ఆన్‌లైన్ చెల్లింపులు చేసుకోవచ్చు.
- స్పీడ్ పోస్టు, రిజిస్టర్ పోస్టులకు క్యాష్‌లెస్ బుకింగ్ సదుపాయం

పోస్టాఫీసులో ఇతర సేవలు....

- సేవింగ్స్ ఖాతా (పీఓఎస్ఏ) రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ), టైం డిపాజిట్ (టీడీ)
- ఆధార్ సేవలు, పాస్ పోర్ట్ సేవలు
- ఎంఐఎస్, పోస్టల్ జీవిత బీమా (పీఎల్ఐ), గ్రామీణ పోస్టల్ జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ)
- సుకన్య సమృద్ధి ఖాతా, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన,
- నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, కిసాన్ వికాస్ పత్రం, ఇతర సేవలు

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) లోగో

- కాగిత రహిత లావాదేవీలు, మొబైల్ బ్యాంకింగ్ అప్లికేషన్ సౌకర్యం
- ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్ బ్యాంకింగ్, సదుపాయం
- మీ పోస్ట్‌మ్యాన్ ద్వారా డోర్‌స్టెప్ బ్యాంకింగ్ సౌకర్యం, అతి తక్కువ రుసుముతో ఇంటి దగ్గరే బ్యాంకింగ్ సేవలు లభ్యం.

వ్యక్తిగత కరెంట్ ఖాతా సదుపాయాలు...

- కేవలం రూ.వెయ్యి బ్యాలెన్స్‌తో లావాదేవీలు, కాగిత రహిత లావాదేవీలు
- చెక్ బుక్ సౌకర్యం, మర్చంట్ బ్యాంకింగ్ యాప్ సౌకర్యం
- మీ దుకాణంలో క్యూర్ కోడ్ స్కాన్‌తో పేమెంట్స్ స్వీకరించవచ్చు


క్యూఆర్ కోడ్‌తో గల ఏటీఎం కార్డు నమూనా

జగనన్న కాలనీలో ఇళ్లనిర్మాణం అద్భుతం

- నాణ్యతతో, శరవేగంగా పూర్తవుతున్న ఇళ్లు
- సంతోషంలో లబ్ధిదారులు
- రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి


పెదరావూరులో కుటుంబంతో ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్రంలో అన్నిచోట్లకన్నా తెనాలిలోని జగనన్న కాలనీల్లో వేగవంతంగా, నాణ్యతతో పేదల ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. పార్టీ సమావేశంలో పాల్గొనేందుకు శనివారం తెనాలి వచ్చిన అయోధ్యరామిరెడ్డి స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి పట్టణ పేదలకు ఇళ్లస్థలాలను ఇచ్చిన పెదరావూరు–1 జగనన్న కాలనీ లే అవుట్‌ను సందర్శించారు. అక్కడ ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లారు. ఆయా కుటుంబాలతో మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను సందర్శించారు. అధికారులతో మాట్లాడి వివరాలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పెదరావూరులోని జగనన్న కాలనీ పురోగతిని చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంతో ముందుచూపుతో వచ్చే తరంకోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఇళ్ల ప్రాజెక్టును స్వయంగా డిజైన్ చేశారని చెప్పారు. ఎమ్మెల్యే శివకుమార్ లబ్ధిదారులతో మమేకమై ఇళ్లను నాణ్యతగా, శరవేగంగా పూర్తిచేయిస్తున్నారని చెబుతూ అభినందనలు తెలియజేశారు.

మురుగునీటి శుద్ధి ప్లాంటు అద్భుతం

తెనాలిలోని పూలే కాలనీలో నిర్మాణంలో ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను ఎంపీ అయోధ్యరామిరెడ్డి సందర్శించారు. 10 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఏర్పాటవుతున్న ప్లాంటులో శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి వాడుకునేలా డిజైన్ చేయటం అద్భుతమని వ్యాఖ్యానించారు. వీరితో మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, పార్టీ నేత కఠారి హరీష్ ఉన్నారు.

ఈ-పంట సురక్షితం

మంచి శనగ పొలంలో ఈ-పంట నమోదు చేయించుకుంటున్న కింది ఫొటోలోని రైతు పేరు పంగులూరు ప్రసాదరావు. పెదనందిపాడు మండలం, అన్నవరం గ్రామం. 8 ఎకరాల్లో మంచిశనగ సాగు చేశాడు. ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటే ప్రభుత్వ ఉచిత పంటల బీమా పథకం వర్తిస్తుందని తెలుసుకుని సచివాలయంలోని వీఏఏ విజయలక్ష్మిను సంప్రదించాడు. వెంటనే వీఏఏ ఆ రైతు పొలానికి చేరుకుని ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామంలోనే ఆర్‌బీకేను ఏర్పాటు చేయించడంతో పెదనందిపాడుకి వెళ్లే శ్రమ తగ్గిందని, దీనివల్ల తన సమయం కూడా ఆదా అయిందంటూ ఈ సందర్భంగా రైతు ప్రసాదరావు హర్షం వ్యక్తం చేశారు.

- ఉచిత పంటల బీమా పథకానికి ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి
- ఆర్బీకే వేదికగా పంటల నమోదు ప్రక్రియ
- జిల్లాలో రబీ సాధారణ విస్తీర్ణం 1.78 లక్షల ఎకరాలు
- ఇప్పటివరకు సాగు చేసింది 92,270 ఎకరాలు
- ఈ-క్రాప్ బుకింగ్ చేసింది 80,159.77 ఎకరాలు


ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏ విజయలక్ష్మి, పక్కన ఏఓ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో రబీ ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. రైతు భరోసా కేంద్రాల వేదికగా తాముంటున్న గ్రామంలోనే సేవలు అందుబాటులోకి రావడంతో రైతులకు సమయంతో పాటు శ్రమ ఆదా అవుతోంది. అంతేకాక వ్యవసాయశాఖ సిబ్బంది సైతం ఇంటింటా తిరిగి ఈ-క్రాప్ నమోదు వల్ల ఒనగూరే సౌకర్యాలపై రైతులను చైతన్య పరుస్తున్నారు.

ఎటు చూసినా పచ్చని పంట పొలాలు...

గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఈ-క్రాప్ నమోదుపై రైతులను చైతన్య పరచడంలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం కనబరిచింది. దీంతో అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయినప్పుడు కనీస పరిహారానికి సైతం రైతులు నోచుకోలేకపోయారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతు సంక్షేమానికి బాటలు పడ్డాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ చొరవతో గ్రామ గ్రామాన ఆర్‌బీకేలు ఏర్పాటయ్యాయి. విత్తనం మొదలు పంట దిగుబడుల విక్రయాల వరకూ ప్రతి అంశంలోనూ ఆర్‌బీకే వేదికగా రైతు ముంగిటకే ప్రభుత్వం అన్ని రకాల సేవలు అందిస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రైతుకు శ్రమతో పాటు సమయమూ ఆదా అవుతుండడంతో పాటు సమస్యల పరిష్కారం, విత్తనం, ఎరువులు, క్రిమి సంహారక మందులు తదితరాల కొనుగోలు కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా పోయింది. దీంతో రైతుల దృష్టి మొత్తం వ్యవసాయం పైనే కేంద్రీకృతం కావడంతో పల్లెసీమలు పచ్చని పంట పొలాలతో అలరిస్తున్నాయి.

ఈ నెలాఖరు లోపు ఈ-క్రాప్ చేయించాలి..



రబీలో పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఈ నెలాఖరులోపు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి. ఈ విషయంగా ఇప్పటికే అన్ని మండలాల వ్యవసాయాధికారులకు స్పష్టంగా ఆదేశాలు జారీ చేశాం. గ్రామాలలో ఆర్‌బీకేల వద్ద వ్యవసాయ అసిస్టెంట్లను సంప్రదించి ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి.

–నున్న వెంకటేశ్వర్లు,
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

80,159.77 ఎకరాల్లో నమోదు...

గుంటూరు జిల్లాలో రబీ సాగు సాధారణ విస్తీర్ణం 1,77,915.12 ఎకరాలు. ఇప్పటి వరకు రైతులు 92,270 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. అందులో 80,159.77 ఎకరాల్లో 86.88 శాతం ఈ-క్రాప్ నమోదు చేయడం జరిగింది.

ఈ-క్రాప్‌తో ఉపయోగాలు ఇలా...


- ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయినప్పుడు పరిహారం పొందవచ్చు
- పంటల బీమా పథకానికి సంబంధించి రైతు వాటా సొమ్మును ప్రభుత్వమే చెల్లిస్తోంది. తద్వారా పంట నష్టపోయినప్పుడు రైతుకు ఉచితంగా నష్టపరిహారం అందినట్లవుతుంది. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీని పొందవచ్చు
- రూ.లక్ష వరకు పంట రుణాలు తీసుకున్న రైతులకు సున్నా వడ్డీ పథకం వర్తిస్తుంది
- వ్యవసాయ ఆధారిత పనిముట్లను రాయితీతో పొందవచ్చు.

హుండీల చోరీ కేసులో పలువురి అరెస్టు

- నిందితులు భీమవరానికి చెందిన వారు
- సీఐ శేషగిరిరావు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శేషగిరిరావు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పలు దేవాలయాల్లో హుండీల చోరీకి పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. తాడేపల్లి సీఐ శేషగిరిరావు, సీఐ సాంబశివరావుతో కలసి శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భీమవరానికి చెందిన ఇద్దరు మైనర్లు ద్విచక్రవాహనాలపై వచ్చి తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాక, ఇతర ప్రాంతాల్లోని దేవాలయాలలో హుండీల చోరీకి పాల్పడుతున్నారు. గతంలో మందడం, కృష్ణాయపాలెంలోని దేవాలయాల్లోనూ ఇదే తరహాలో చోరీ జరగడంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని కనక దుర్గ వారధి వద్ద ఉన్న శివాలయం సమీపంలో ఇద్దరు మైనర్లు అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. పెనుమాకలో హుండీ పగలకొట్టి నగదు దోచుకున్నది తామేనని అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.5 వేల నగదు రికవరీ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. దర్యాప్తును త్వరగా ఛేదించిన ఎస్ఐలు నారాయణ, రమేష్, క్రైం సిబ్బంది కొండలరావు, కళ్యాణ్, బాబూరావులను అభినందించారు.



పులిచింతల నీటినిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రస్తుత నీటి నిల్వ 43.2071 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 1200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా. దిగువకు 2,200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1,716 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. పలు కాలువలకు 1,525 క్యూసెక్కులు నీటిని వదిలారు.

కరోనా జీరో

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.



న్యూస్‌రీల్

టీడీపీ, జనసేనవి పగటికలలు



సాక్షి,అమరావతి: టీడీపీ, జనసేన నేతలు పగటికలలు కంటున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి విమర్శించారు. తాడేపల్లిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నేత అయ్యన్నపాత్రుడికి మతి చెడిందని, అందువల్లే తాను కాబోయే హోంమంత్రి అంటూ కలలు కంటున్నారని మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో టీడీపీ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. జనసేన నాయకుడు నాగబాబు ప్యాకేజీ పెంచుకునేందుకే సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నాగబాబు చెబుతున్నట్లు 40 శాతం ఓటింగ్ ఉంటే జనసేన ఒంటరిగానే పోటీ చేసి అధికారంలోకి రావొచ్చు కదా... చంద్రబాబుతో 'రాయబేరాలు' ఎందుకు... అని ప్రశ్నించారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు పూర్తిగా సీఎం వైఎస్ జగన్ ఫోబియా పట్టుకుందని, అందుకే జనసేనతో పొత్తు కోసం ఆరాటపడుతున్నారని చెప్పారు. నిస్వార్థంగా వలంటీర్లు సేవ చేస్తున్నారని, వారిపై కూడా టీడీపీ నేతలు విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. సీఎం జగన్ 99 శాతం హామీలను నెరవేర్చారని, తప్పకుండా మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మాచర్ల మున్సిపాలిటీకి జాతీయ స్కోచ్ అవార్డు

మున్సిపల్ కమిషనర్ రమణబాబు



మాచర్ల: మాచర్ల మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డు లభించడం గర్వకారణమని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు పేర్కొన్నారు. ఈ అవార్డుతో జాతీయ స్థాయిలో మాచర్ల మున్సిపాలిటీ ప్రత్యేక గుర్తింపు పొందినట్లు తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం కమిషనర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆయా మున్సిపాలిటీలు అందిస్తున్న సేవలపై జాతీయ స్థాయిలో సర్వే నిర్వహించగా, మాచర్ల మున్సిపాలిటీ పారిశుద్ధ్యం నిర్వహణ, పరిశుభ్రతతో పాటు అనేక అంశాల్లో ముందు వరుసలో నిలిచినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని నాలుగు పురపాలక సంఘాలు స్కోచ్ అవార్డులకు ఎంపిక కాగా అందులో మాచర్ల మున్సిపాలిటీ ఒకటన్నారు. అవార్డు పొందడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

హోరాహోరీగా షూటింగ్‌బాల్ పోటీలు



షూటింగ్ బాల్ రాష్ట్ర పోటీల్లో మహిళల విన్నర్ ట్రోఫీ అందుకున్న గుంటూరు జట్టు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) లీగ్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ స్త్రీ, పురుషుల పోటీల్లో గుంటూరు, నెల్లూరు జిల్లాల జట్లు సత్తా చాటాయి. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో శనివారం ఈ పోటీలు హోరాహోరీగా జరిగాయి. మహిళల విభాగంలో జరిగిన ఫైనల్స్‌లో గుంటూరు జట్టు విశాఖపట్నం జట్టును ఓడించి విజేతగా నిలిచింది. పురుషుల విభాగం ఫైనల్స్‌లో నెల్లూరు జట్టు పల్నాడు జట్టుపై గెలిచి విన్నర్ ట్రోఫీని అందుకుంది. మహిళల విభాగంలో విశాఖపట్నం జట్టు, పురుషుల విభాగంలో పల్నాడు జట్టు రన్నర్ ట్రోఫీలను అందుకున్నాయి. ఈ పోటీలను ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్.ఎ.అజీజ్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి జోసఫ్, కృష్ణాజిల్లా సంఘం కార్యదర్శి కిషోర్, టోర్నమెంట్ డైరెక్టర్ మనోహర్ రెడ్డి ఈ పోటీలను పర్యవేక్షించారు.

వ్యవసాయ కళాశాలకు అంతర్జాతీయ ఖ్యాతి

- రూ.వేల కోట్ల ఆదాయం సృష్టించిన బీపీటీ 5204 వంగడం
- జాతీయ స్థాయి ర్యాంకుల సరసన బాపట్ల కళాశాల
- విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి
- ఘనంగా బాపట్ల వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవం



వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ జీవీఎల్, ఎమ్మెల్యే కోన, వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి, పోతుల సునీత

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాలలో సృష్టించిన బీపీటీ-5204 వరి వంగడం అంతర్జాతీయ ఖ్యాతిని గడించడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా రైతులకు సంవత్సరానికి వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూరుస్తోందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో 11వ స్థానంలో నిలిచి బోధన, పరిశోధన, విస్తరణలో ప్రత్యేక స్థానాన్ని సాధించిందని తెలిపారు. దేశం మొత్తం రూపొందించబడుతున్న వరి వంగడాల్లో 1/3 వంతు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయమే సృష్టిస్తోందన్నారు. ఈ ఉత్సవాన్ని తొలుత ఎడ్ల బండ్లపై మేళతాళాలతో ఊరేగింపుగా ప్రారంభమైంది. భరతనాట్యం, విద్యార్థుల గ్రామీణ కోలాటాల నడుమ వీసీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల వ్యవసాయ సంబంధిత ప్రదర్శనశాలలను ప్రారంభించారు. పెవిలియన్ వద్ద జరిగిన బహిరంగ సభలో రికార్డ్ స్థాయిలో 1200 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఈ కళాశాలతో తమకు గల అనుబంధాన్ని ఆత్మీయంగా పంచుకున్నారు. వీసీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి రైతు విగ్రహం వద్ద ప్లాటినం జూబ్లీ పైలాన్‌ను, బీపీటీ-5204 పైలాన్‌ను ఆవిష్కరించారు. పైలాన్ వద్ద నుంచి పరేడ్ ఆఫ్ ప్రైడ్ రెట్రోవాక్‌ను మేళతాళాలతో నిర్వహించారు. అనెక్స్ భవనం వద్ద సంప్రదాయ రాజస్థానీ, గ్రామీణ కోలాటాలతో వీరికి ఘన స్వాగతం పలికారు. 1975 సంవత్సర పూర్వ విద్యార్థులు 75 కొబ్బరిమొక్కలు నాటి సరికొత్త కొబ్బరి తోటను ప్రారంభించారు. పలువురు పూర్వ విద్యార్థులు నూతన అతిథి గృహ నిర్మాణానికి విరాళాలు అందజేశారు. అత్యంత అట్టహాసంగా ప్రారంభమైన అమృతోత్సవంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, వ్యవసాయ డీన్ డాక్టర్ ఎ.ప్రతాప్ కుమార్ రెడ్డి, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ డైరెక్టర్ డాక్టర్ పి.రాంబాబు, విద్యార్థి విభాగం డీన్ డాక్టర్ పి.సాంబశివరావు, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ సీహెచ్ చిరంజీవి, అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి, ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి, పూర్వ అసోసియేట్ డీన్లు తదితరులు పాల్గొన్నారు.



పీబీపీటీ 5204 పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి

సమష్టి కృషితో విశ్వవిద్యాలయం సాధిద్దాం

బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు అందరం కలిసికట్టుగా ప్రయత్నం చేద్దామని ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్ని మాట్లాడారు. 1945 సంవత్సరం కళాశాల ఏర్పాడటానికి కారణాలను వివరించటంతో పాటు కళాశాల స్థాపించడానికి కృషి చేసిన పాములపాటి వెంకటరావు, బీవీ నాథ్, చౌంటి రామమూర్తి, ఎస్ ఎస్ పాత్రుడును గుర్తుచేసుకోవాలని శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. ఈ కళాశాలలో చదువుతున్న ఎస్‌వీఎస్ శాస్త్రి, ఎన్‌జీబీ రావు, ఐటీ సుబ్బారావుకు పద్మశ్రీ అవార్డు వచ్చిందంటే కళాశాల ఖ్యాతి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి సలహాదారులు అజేయకలామ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతికతను జోడించి ముందుకుపోవాలని సూచించారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు చదువు పూర్తి చేసుకునేలోపే వ్యవసాయ రంగానికి సంబంధించి ఏ విధంగా స్థిరపడాలో వారికి పూర్తి అవగాహన కల్పించాలని చెప్పారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్ల ప్రాంతంలో చదివిన పూర్వ విద్యార్థులు ఈ ప్రాంతాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. విశ్వవిద్యాలయం బాపట్లకు తీసుకువచ్చేందుకు అందరూ సహకరించాలని కోరారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారులు ఎం.మాలకొండయ్య మాట్లాడుతూ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో పొందుపరిచిన కళాశాల చరిత్రను అందరికి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రిటైర్డు ఐపీఎస్ అధికారులు బి.శ్రీనివాసులు, దేవరపల్లి కనకరత్నం, ప్రభాకర్ మాట్లాడుతూ బాపట్ల వ్యవసాయ కళాశాల తమ జీవితాలకు మంచి బాట వేసిందని గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్సీలు కళ్యాణి, పోతుల సునీత మాట్లాడుతూ బాపట్ల వ్యవసాయ కళాశాల చరిత్రకు అనుగుణంగా విద్యార్థులు చక్కగా చదువుకుని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి, కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన 32 స్టాల్స్ అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విజ్ఞాన్ మహోత్సవ్ -2కే23 పోస్టర్ ఆవిష్కరణ



చేబ్రోలు: విజ్ఞాన్ యూనివర్సిటీలో అతిపెద్ద మహోత్సవానికి రంగం సిద్ధం చేశామని వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయిలో నిర్వహించే యూత్ ఫెస్టివల్ 'విజ్ఞాన్ మహోత్సవ్-2కే23' పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తమ యూనివర్సిటీ భారీ యువజనోత్సవాలకు వేదిక కాబోతోందన్నారు. విజ్ఞాన్ మహోత్సవ్‌లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 50 వేల మంది విద్యార్థులు తరలివచ్చే అవకాశం ఉందని తెలిపారు. విజ్ఞాన్ మహోత్సవ్ పోటీల విజేతలకు భారీ స్థాయిలో నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. విజ్ఞాన్ మహోత్సవాన్ని ఈ ఏడాది వినూత్నంగా నిర్వహించడంతో పాటు పారా అథ్లెటిక్స్ పోటీలను కూడా ప్రారంభిస్తున్నామని తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవ్‌లో మొత్తం 82 ఈవెంట్లను నిర్వహించనున్నారు. స్పోర్ట్స్ ఫీట్‌లో వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్ తదితర క్రీడాంశాల్లో జాతీయ స్థాయిలో విద్యార్థులకు పోటీలు ఉంటాయని చెప్పారు. వీటితో పాటు కల్చరల్స్, మ్యూజిక్, డాన్స్, స్పాట్‌లైట్, థియేటర్ ఆర్ట్స్ వంటి రంగాలను కలుపుకుని సాంకేతిక, సాంస్కృతికాంశాల్లో జాతీయ స్థాయిలో పోటీలు ఉంటాయని వివరించారు. పారా అథ్లెటిక్స్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు, వారి సత్తాను పెంపొందించుకునేందుకు విజ్ఞాన్ మహోత్సవ్ ఓ చక్కని వేదిక అని తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యార్థులంతా ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

అనాథల సేవ.. ఆనంద తోవ!

విధివంచిత బాలలకు ఉత్తమ విద్య

- ఉచితంగా విద్యాబోధన, హాస్టల్ వసతి
- ఆస్ట్రేలియా విద్యార్థులతో ఏటా శిక్షణ
- 'జూమ్'లో ఉపాధ్యాయులకు అవగాహన
- ఆస్ట్రేలియన్ బిజినెల్ డీన్స్ కౌన్సిల్ అవార్డు గ్రహీత డాక్టర్ విద్యాసాగర్ అత్తోట చొరవ



విద్యార్థులతో విద్యాసాగర్, సియాన్, ఆస్ట్రేలియా బృందం (ఇన్‌సెట్)డాక్టర్ అత్తోట విద్యాసాగర్

తెనాలి: పట్టణంలోని ఆర్ఆర్ నగర్‌లో ఉన్న ఓ స్వచ్ఛంద పాఠశాల అది. అదే ప్రాంగణంలో హాస్టల్, ప్రార్థనా మందిరం. కొద్దిరోజులుగా అక్కడ విదేశీ యువతులు కనిపిస్తున్నారు. బోధనోపకరణాలతో చిన్నారులకు పాఠాలు నేర్పిస్తున్నారు. వారితో ఆడిపాడుతున్నారు. ఆనందంతో తుళ్లిపడుతున్నారు. అనాథలు, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు లేని పేదింటి పిల్లల కోసం నడుస్తున్న ఇంగ్లిష్ మీడియం పాఠశాల అది. వీరికి విదేశీయులు పాఠాలు చెప్పటం ఏమిటాని ఆరా తీస్తే.. ఆస్ట్రేలియాలో నడుస్తున్న ఆధునిక విద్యను ఇక్కడి చిన్నారులకు అందించే ప్రయత్నమని తెలిసింది.

పట్టణానికి చెందిన ప్రవాస భారతీయుడు, ఆస్ట్రేలియాలోని నోట్రిడేమ్ యూనివర్సిటీకి సిడ్నీలోగల స్కూల్ ఆఫ్ లా అండ్ బిజినెస్ ప్రొఫెసర్, డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ అత్తోట విద్యాసాగర్ నేతృత్వంలో అక్కడి మరో ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ సియాన్ కీర్నే సహకారంతో తెనాలి ఆర్ఆర్ నగర్‌లో దయామణి జోసఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ పేరుతో స్వచ్ఛంద పాఠశాలను నడుపుతున్నారు. 2015 నుంచి నడుస్తున్న ఈ పాఠశాలకు అనుబంధంగా హాస్టల్, ప్రార్థనా మందిరం ఉన్నాయి. తొలి బ్యాచ్ విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలకు దీటుగా ఆస్ట్రేలియాలోని నాణ్యమైన విద్యాబోధనతో స్కూల్ నడవాలనేది డాక్టర్ విద్యాసాగర్ ఆశయం. అందుకు తగినట్టుగా ఇక్కడి ఉపాధ్యాయులకు 'జూమ్' తరగతుల్లో శిక్షణనిస్తున్నారు. ఏటా శీతాకాలం రెండు వారాలపాటు అక్కడి యువ ఉపాధ్యాయినులు, కాలేజి విద్యార్థినులు ఇక్కడి చిన్నారులకు బోధనోపకరణాలు, ఆటపాటలతో పాఠాలను నేర్పుతున్నారు. ఈ క్రమంలో డాక్టర్ విద్యాసాగర్, ప్రొఫెసర్ సియాన్ కీర్నేతో పాటు 12 మంది ఆస్ట్రేలియన్లు ప్రస్తుత శీతాకాలంలో ఇక్కడికి వచ్చారు. వీరిలో కొందరు ప్రీస్కూల్ ఉపాధ్యాయినులు. పేద పిల్లలకు ఎవరైతే సాయం చేస్తారో.. వారు దేవుడికి సేవ చేసినట్టు అన్న బైబిల్ వాక్యాన్ని విశ్వసించిన డాక్టర్ విద్యాసాగర్ తన సంపాదనలో కొంత మొత్తాన్ని వెచ్చించి చేస్తున్న స్వచ్ఛంద సేవలో వీరంతా భాగస్వాములయ్యారు. వీరిలో ఇక్కడికి రెండు మూడు పర్యాయాలు వచ్చిన వారున్నారు. అనాథలైన ఆ చిన్నారులతో గడుపుతూ వారి ముఖాల్లో ఏసును చూస్తున్నంత అనుభూతిని చెందుతున్నామని సంతోషంతో చెబుతున్నారు. ఆస్ట్రేలియాలో ఉద్యోగం/ఉన్నత చదువుల్లో ఉన్న వీరంతా ఎక్కడో దేశంకాని దేశంలో ఓ చిన్న పట్టణంలోని అనాథల సేవలో కొంతకాలమైనా గడపటం గొప్ప విశేషం. తీరిక సమయాల్లో ఇక్కడి పంటలు, పరిశ్రమలను సందర్శిస్తూ ఆ విశేషాలను తెలుసుకుంటున్నారు.



పాఠశాల విద్యార్థులకు విద్యాబోధన

హృదయం నిండా సంతృప్తిగా ఉంది



ఆస్ట్రేలియాలో నేను ఫస్ట్ క్లాస్ టీచరుగా చేస్తున్నాను. ఇప్పటికి మూడు పర్యాయాలు ఇక్కడి పాఠశాలకు వచ్చి పిల్లలకు పాఠాలు చెప్పాను. వీరితో గడుపుతుంటే కాలం తెలియడం లేదు. సొంతూళ్లో ఉన్నట్టు, హృదయం సంతృప్తితో నిండినంత ఆనందంగా ఉంది.

– ఎమోజెన్, టీచర్, ఆస్ట్రేలియా

ఇక్కడి పాఠశాల చూద్దామని వచ్చా



బిజినెస్ స్టూడెంట్‌ను. బ్యాచలర్స్ డిగ్రీ ఫైనలియర్‌లో ఉన్నా. ఇక్కడి పాఠశాల గురించి తెలుసుకుని చూద్దామని వచ్చా. కొద్ది రోజులుగా వీరికి చేతనైనంత నేర్పుతూ వచ్చాను. దగ్గర్లోని పంట పొలాలు, పరిశ్రమలను సందర్శించా. ఇండియా చాలా అందంగా ఉందని అనిపించింది.

– ఎమ్మాలిన్, బిజినెస్ స్టూడెంట్, ఆస్ట్రేలియా

ప్రతిష్టాత్మక అవార్డుల ప్రొఫెసర్ విద్యాసాగర్..

డాక్టర్ విద్యాసాగర్ తెనాలిలో డిగ్రీ, హైదరాబాద్‌లో ఎంఫిల్, అమెరికాలో ఎంఏ, ఆస్ట్రేలియాలో పీహెచ్‌డీ చేశారు. గత పదిహేనేళ్లుగా నేట్రే డేమ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా చేస్తున్నారు. విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపరచే చొరవలకు వైస్‌చాన్సలర్ అవార్డును అందుకున్నారు. ఆస్ట్రేలియన్ బిజినెస్ డీన్స్ కౌన్సిల్ నుంచి ఆస్ట్రేలియన్ బిజినెస్ డీన్స్ కౌన్సిల్ అవార్డును గత ఏడాది స్వీకరించారు. అయిదు పరిశోధన పుస్తకాలను ప్రచురించారు. తాజా పుస్తకం 'మైండ్ ఓవర్ మేటర్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్'. 40 పైగా పరిశోధనా వ్యాసాలు వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఫార్చ్యూన్ కంపెనీలతో సహా పలు అంతర్జాతీయ బిజినెస్ సంస్థలకు కన్సల్టెన్సీ సేవలను అందిస్తున్నారు. తల్లిదండ్రుల పేరిట దయామణి జోసఫ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలను నిర్వహిస్తున్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటిమట్టం శనివారం 572.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,120, ఎడమ కాలువకు 6,478, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 29,763, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 49,054 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 49,054 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం నీటిమట్టం 844.80 అడుగుల వద్ద ఉంది.

అర్బన్ టీడీపీలో చిచ్చు!

- పదవుల పంపకంలో రచ్చ
- రెండేళ్లు అయినా అర్బన్ కమిటీ లేదు
- పదవుల విషయంలో అభిప్రాయభేదాలు
- కమిటీపై తూర్పు, పశ్చిమ ఇన్‌చార్జిల అసంతృప్తి
- అరుపులు కేకలతో ముగిసిన సమావేశం
- అచ్చెన్నయుడు వద్దకు పంచాయితీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అర్బన్ తెలుగుదేశం పార్టీలో పదవుల చిచ్చు రేగింది. అర్బన్ కమిటీ పదవుల పంపకంలో రచ్చ చెలరేగి చివరికి పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నయుడు వద్దకు పంచాయితీ చేరింది. దీంతో ఆయన కమిటీ నియామకాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సమాచారం. గుంటూరు అర్బన్ కమిటీ అధ్యక్షుడిగా డేగల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.రాజేష్‌ను మాత్రమే పార్టీ ప్రకటించింది. ఏడాది కాలం గడిచినా పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో కొత్త కమిటీ ఎంపిక కోసం ఇటీవల పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో నాయకులు కూర్చుని చర్చించారు. రాష్ట్రంలో ఎక్కడా కార్పొరేషన్లలో అర్బన్ కమిటీలు లేనప్పుడు ఇక్కడ మాత్రం ఎందుకని పార్టీ నేతలు నిలదీసినట్లు తెలుస్తోంది. అధిష్టానం నుంచి 12 మందితో కమిటీ ఎంపిక చేయాలని ఆదేశాలు ఉన్నందున అక్కడి వరకూ పరిమితం అవుదామని, పార్టీ నుంచి ప్రకటన వచ్చిన తర్వాత ఇతర సభ్యులను నియమించుకోవచ్చన్న చర్చ జరిగింది. దీనిపై అర్బన్ అధ్యక్షుడు డేగల ప్రభాకర్, గుంటూరు తూర్పు ఇన్‌చార్జి నసీర్ అహ్మద్ మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. నసీర్‌అహ్మద్ 11 పేర్లు ప్రతిపాదించినట్లు తెలిసింది. అయితే తాను ప్రతిపాదించిన పేర్లు కాకుండా తన నియోజకవర్గం నుంచి వేరే వారిని నియమించడానికి వీల్లేదని తెగేసి చెప్పినట్లు సమాచారం. మీరు ప్రతిపాదించిన వారిని నియమిస్తాం, అదే సమయంలో అర్బన్ అధ్యక్షుడిగా తాను కొంతమందిని ప్రతిపాదిస్తానని డేగల చెప్పగా నసీర్ వ్యతిరేకించారు. తన నియోజకవర్గంలో అనవసరంగా జోక్యం చేసుకుంటున్నారంటూ డేగలపై విరుచుకుపడినట్లు సమాచారం. ఈ వివాదంతో గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూరి రవీంద్ర కోపంతో తన వద్ద ఉన్న కాగితాలను విసిరేసి సమావేశం నుంచి వెళ్లిపోవడంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం నగరానికి చెందిన తెలుగుదేశం నాయకులు కొంతమంది అచ్చెన్నాయుడిని కలిశారు. అర్బన్‌లో జరుగుతున్న వివాదాల నేపథ్యంలో కమిటీ ఇప్పట్లో వేయడం కుదరదని ఆయన తేల్చిచెప్పినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గుంటూరు పశ్చిమ సీటు, పొత్తుల్లో జనసేనకు కేటాయిస్తారన్న ప్రచారం జరుగుతుండటంతో అర్బన్ అధ్యక్షుడు డేగల ప్రభాకర్ గుంటూరు తూర్పు సీటుపై కన్నేయడమే ఈ వివాదాలకు కారణంగా తెలుస్తోంది.

నేడు కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్ష

నగరంపాలెం(గుంటూరు): కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న ప్రిలిమినరీ రాత పరీక్షకు సర్వం సిద్ధమైంది. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 30,916 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. జిల్లాలో 45 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. 10 గంటలు దాటాక ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించే ప్రసక్తిలేదని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. శనివారం ఏసీ కళాశాల పరీక్ష కేంద్రంలోని గదులు, ఇతరత్రా సౌకర్యాలను తూర్పు డీఎస్పీ బి.సీతారామయ్య, కొత్తపేట సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐలు, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్ పరిశీలించారు.

ఉద్యోగోన్నతులుగానే పరిగణించాలి

- డీవైఈవో కె.సుధాకర్‌రెడ్డి
- ఉన్నత పాఠశాలల్లో పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్
- ఉమ్మడి జిల్లాలో 112 పోస్టులు భర్తీ



మాట్లాడుతున్న డీవైఈవో కె.సుధాకర్‌రెడ్డి, పక్కన ఉర్దూ డీఐ ఖాసిం

గుంటూరుఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు బోధకుల కొరతను తీర్చేందుకు చేపట్టిన కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్న పోస్టులను ఉద్యోగోన్నతులుగానే పరిగణించాలని డీవైఈవో కె.సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ గణితం, ఇంగ్లీష్, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రంలో ఖాళీలను భర్తీ చేసేందుకు శనివారం సీనియర్ ఎస్జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అలవెన్సుతో ఆయా పోస్టుల్లో పనిచేసేందుకు సబ్జెక్టుల వారీగా హాజరైన ఉపాధ్యాయుల్లో కొంత మంది నాట్ విల్లింగ్ ఇవ్వడంతో డీవైఈవో జోక్యం చేసుకున్నారు. గతేడాది అక్టోబర్‌లో నిర్వహించిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో విల్లింగ్ ఇచ్చిన వారినే తిరిగి, కౌన్సెలింగ్‌కు ఆహ్వానించామని చెప్పారు. న్యాయ వివాదాల కారణంగా ఉద్యోగోన్నతులు చేపట్టలేని పరిస్థితుల్లో విద్యార్థులకు నష్టం కలుగకుండా తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టిన పోస్టుల భర్తీ ప్రక్రియలో విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు వస్తాయని స్పష్టం చేశారు. నాట్ విల్లింగ్ ఇవ్వడం ద్వారా ఉద్యోగోన్నతులను పోగొట్టుకున్న వారవుతారని ఉపాధ్యాయులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఈ విధంగా గణితం-14, ఇంగ్లీష్-28, సోషల్-28, జీవశాస్త్రం-42 చొప్పున మొత్తం 112 పోస్టులను భర్తీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో సత్తెనపల్లి ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు, సీనియర్ హెచ్‌ఎంలు ఏ.తిరుమలేష్, జె.రమేష్‌కుమార్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

జిల్లా ఉప రవాణా కమిషనర్ కరీమ్



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీటీసీ కరీమ్, ఎంవీఐ రాఘవరావు తదితరులు

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు తెనాలి ప్రాంతీయ రవాణా అధికారుల ఆధ్వర్యంలో శనివారం ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. తెనాలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో డీటీసీ కరీమ్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు అజాగ్రత్తగా ఉండకూడదన్నారు. వాహనాలు నడిపేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు తెలిసినా, కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువత ర్యాష్ డ్రైవింగ్ సరదా అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని, మరణాలకు, శాశ్వత అంగవైకల్యానికీ దారితీస్తోందని చెప్పారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకే రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. తెనాలి, గుంటూరు ఏఎంవీఐలు బి.మధుసూదనరావు, జె.అనిల్‌కుమార్, తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్, త్రీ టౌన్ సీఐ యు. శ్రీనివాసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వెల్లలూరులో 521 మందికి ఉచిత కళ్లజోళ్ల పంపిణీ

-బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

వెల్లలూరు(చేబ్రోలు): బజరంగ్ ఫౌండేషన్ జగనన్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామంలో శనివారం 521 మందికి ఉచితంగా కళ్లజోళ్లను వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ పంపిణీ చేశారు. ఈ నెల పదో తేదీన నిర్వహించిన నేత్ర జ్యోతి కంటి వైద్య శిబిరంలో 636మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో అవసరమైన 521 మందికి ఉచితంగా అందజేశారు. ఏడాది కాలం పాటు జగనన్న సంక్షేమ సంవత్సరంగా భావించి బజరంగ్ ఫౌండేషన్ ద్వారా 51 గ్రామాల్లో సంక్షేమ సేవా కార్యక్రమాలు చేయటం జరుగుతుందని మురళీకృష్ణ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పించిన విధంగా విద్యా, వైద్య రంగాలలో గ్రామ స్థాయిలో గడప గడపకు సేవలను అందించటం ద్వారా సమాజం యొక్క రూపు రేఖలను మార్చి భవిష్యత్ తరాలకు అభివృద్ధి చెందిన సమాజాన్ని అందించటంలో భాగంగా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. వలంటీర్లకు ప్రమాద బీమా సౌకర్యాన్ని ఉచితంగా కల్పించటానికి ఐదు లక్షల బీమా పాలసీలను 13మంది వలంటీర్లకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బండి శివరామప్రసాద్, ఇక్కుర్తి మల్లికార్జునరావు, పెరవలి మస్తాన్‌రావు, అంబటి రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో టెలీ మెడిసిన్ హబ్స్‌లో మెడికల్ ఆఫీసర్, స్పెషాలిటీ వైద్యుల ఉద్యోగాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ జె.హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనరల్ ఫిజిషియన్ -1, గైనకాలజిస్టు-2, పీడియాట్రీషన్-1, మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలు-4 ఖాళీగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టు వైద్యుల ఉద్యోగాలకు ఈనెల 24న గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు, జిరాక్స్ సెట్ తీసుకుని రావాలన్నారు. విద్యార్హతలు, వేతనాలు, దరఖాస్తు ఫారం కోసం అభ్యర్థులు గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

ఏపీ చౌక్‌బాల్ జట్ల ఎంపిక

చిలకలూరిపేటటౌన్: క్రీడల వల్ల అనేక ప్రయోజనాలున్నాయని ఆంధ్రప్రదేశ్ చౌక్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.సుధాకర్ చెప్పారు. శనివారం ఏపీ చౌక్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాలుర, బాలికల జట్ల ఎంపికను మోడరన్ గ్రీన్ వ్యాలీ స్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో మోడరన్ విద్యాసంస్థల డైరెక్టర్ చేబ్రోలు మహేష్, స్కూల్ ప్రిన్సిపాల్ జి రాజేష్, పీఈటీలు అమీర్ హుస్సేన్, శ్రావణ్, శబరీనాథ్, లక్ష్మి ప్రసన్న, మనోహర్, ప్రవీణ్ పాల్గొన్నారు.